## వర్ధన్నపేటలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



**వర్ధన్నపేట/జులై 7(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌ఛార్జ్ జిల్లా ధర్మయ్య మాదిగ ముఖ్య అతిథిగా హాజరై దండోరా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 32 ఏళ్లుగా సజీవంగా నిలబడి లక్ష్యాన్ని ముద్దాడిన ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమేనని కొనియాడారు. 32 ఏళ్ల కాలంలో దండోరా జెండా కేవలం మాదిగలకే పరిమితం కాకుండా సమస్త పీడిత వర్గాలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మహనీయుల కమిటీ మండల చైర్మన్ మారపెల్లి ఎల్లయ్య మాదిగ, సీనియర్ నాయకులు మరుపట్ల అంజయ్య మాదిగ, అలిపిరెడ్డి రామచంద్రరెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు చాడ కరుణాకర్ మాదిగ, ఎంఎస్పీ ప్రజాప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి సీనపల్లి రాజు మాదిగ, అంబేద్కర్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు మారపాక బాబు, గుడ్డేటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగారంలో ఘనంగా సీత్లా పండుగ.



**బయ్యారం/,జులై 7.(జర్నలిస్ట్ వార్త)** సీత్లా పండుగను బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో మంగళవారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని గిరిజన యువతులు, మహిళలు, యువకులు సీత్లా భవానికి నైవేద్యం సమర్పించేందుకు నృత్యాలు చేస్తూ గ్రామ పొలిమేరకు తరలివెళ్లారు.సీత్లా భవానికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో వచ్చే పెద్ద పుష్యాల కార్తె మొదటి వారంలో ఈ పండుగను నిర్వహిస్తారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని, తండావాసులు ఆరోగ్యంగా ఉండాలని, పశు సంపద అభివృద్ధి చెం దాలను గిరిజనులు సీత్లా భవానికి మొక్కుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్,వార్డు మెంబర్ గుగులోత్ అనూష వెంకటేష్, గ్రామ నాయకులు మహిళలు చిన్నపిల్లలు,తదితరులు పాల్గొన్నారు.

## బాల్యతండాలో ఘనంగా సిత్లా పండుగ.

### -ప్రాచీన గిరిజన దాటుడు పండుగకు పూర్వ వైభవం.



**బయ్యారం/,జులై 7.(జర్నలిస్ట్ వార్త)**మండలంలోని బాల్యతండా గ్రామ పంచాయతీలో గిరిజనులు సీత్లా భవానీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిజనులు బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.వర్షాలు సంవృద్ధిగా కురువాలని,పాడిపంటలు బాగుండాలని,గ్రామస్తులను క్షేమంగా చూడాలని వేడుకున్నారు.గిరిజనులు ఈ సందర్భంగా ఆటపాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ ఆంగోతు బిందు,బాల్య తండా సర్పంచ్ అజ్మీర దేవోజి నాయక్,ఆంగోతు శ్రీకాంత్ నాయక్,సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ గారు లంబాడీల ఐక్య వేదిక బయ్యారం మండల అధ్యక్షులు జరుపుల శ్రీను నాయక్,బోడ బాలు, ఆంగోతు రాంబాబు,ఆంగోతు రవీందర్, అజ్మీర తులస్య,భూక్య చిరంజీవి, భూక్య శ్రీను,గుగులోతు నరేష్,భూక్య నరేష్,భూక్య లక్ష్మా,బానోతు బద్రు, అజ్మీర మంగ్య,అజ్మీర వీరన్న,ఆంగోతు కళ్యాణ్,తావుర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు చెల్లు..

### -తహసీల్దార్ నాగరాజు.




**బయ్యారం/,జులై 7. (జర్నలిస్ట్ వార్త)** భూముల రీ సర్వేతో భూ సమస్యలు ఇక చెల్లు అవుతాయని తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు.బుధవారం మండలంలోని గురిమెల్ల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు.ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం లబ్ది చేకూర్చనుందని,అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్న వారికి ఇకపైన రద్దయ్యేలా చర్యలు చేపడతామని, నిజమైన రైతులకు న్యాయం చేస్తామన్నారు.భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.రికార్డులు,పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగనలోకి తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారిస్తామని,తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని,ప్రభుత్వ భూముల సైతం నిర్ధారణ అవుతాయన్నారు.ప్రభుత్వ భూములు ఆక్ర మిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందన్నారు.సర్పంచ్ వజ్జ భద్రయ్య,సెక్రెటరీ,జిపిఓ,ఐకేపీ సర్వేయర్,రెవెన్యూ ఇన్స్పెక్టర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇతర సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

## మందకృష్ణ జన్మదిన వేడుకలు





**వర్ధన్నపేట/జులై 7(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రభాకర్ మాదిగ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, 4వ వార్డు మెంబర్ గోలి సుధాకర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 32 ఏళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేర్చిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు ఎక్కడ అన్యాయం జరిగినా మందకృష్ణ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి గ్రామ ఉప సర్పంచ్ మేకల దేవేందర్, కాంగ్రెస్ నాయకులు ఎండి జాఫర్, బిర్రు యాకయ్య, బిర్రు బిక్షపతి, బిర్రు భాస్కర్, బిర్రు రమేష్, మరుపట్ల బాబు, బిర్రు రవీందర్, కందికట్ల స్కైలాబ్, బిర్రు కోర్నేలు, గణపాక హరీష్, తాటికాయల నాగరాజు, గుండేటి శివకృష్ణ, బిర్రు రాజు, తాటికాయల మనోహర్, బిర్రు మధు, కాంభోజ సాయిలు, మరుపట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గంగు ఉపేందర్ శర్మ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి.

### -రామాలయ ప్రధాన అర్చకులు సుదర్శన చార్యులు.



**బయ్యారం/,జులై 7.(జర్నలిస్ట్ వార్త)** వేయి స్తంభాల దేవాలయం ప్రధాన అర్చకుడిగా పని చేస్తున్న గంగు ఉపేందర్ శర్మ డిడిఎన్ అర్చకులు పెద్ద దేవాలయాల దాయాదాక్షిన్యాలతో బ్రతుతున్నామని చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని డిడిఎన్ అర్చకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బయ్యారం రామాలయ ప్రధాన అర్చకులు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు సుదర్శన చార్యులు డిమాండ్ చేశారు.

ధూప దీపం పథకం ఏమి ఉపేందర్ శర్మ నో ఇంకెవరో ప్రారంభించింది కాదు.2007లో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఈ పథకం. అర్చకులకు అప్పుడైనా ఇప్పుడైనా దేవాదాయ శాఖ నుండే గౌరవ వేతనం అందుకుంటున్నాం.ఇప్పుడైతే ప్రత్యేకించి ప్రభుత్వం పే & అకౌంట్స్ నుండే వేతనం అందిస్తుంది.కానీ ఏ పెద్ద దేవస్థానాల ఆదాయాన్ని మన వేతనాలకు వెచ్చించడం లేదని సుదర్శన చర్యలు అన్నారు. ఈ నేపథ్యంలోఉపేందర్ శర్మ మాట్లాడిన మాటలు అర్ధం లేనివని వెంటనే డిడిఎన్ అర్చకులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## మంచినీటి సరఫరాకు మరింత మెరుగైన చర్యలు

### ముత్తారం ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్



**భీమదేవరపల్లి/జులై 7 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామపంచాయతీలో మంగళవారం హర్ ఘర్ జల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామీణ నీటి సరఫరాల శాఖ డీఈ అనిల్, ఏఈ చైతన్య హాజరై జల్ జీవన్ మిషన్ అమలు, సురక్షిత తాగునీటి సరఫరా, నీటి సంరక్షణ, పైప్‌లైన్ నిర్వహణ వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ మాట్లాడుతూ, గ్రామంలో మొత్తం 346 నల్లా కనెక్షన్ల ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి 24 గంటల్లోపు పరిష్కరిస్తున్నామని చెప్పారు. జల్ జీవన్ మిషన్ లక్ష్యాల సాధనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, తాగునీటిని వృథా చేయకుండా సంరక్షించాలని సూచించారు. అనంతరం అధికారులు గ్రామస్థులతో మాట్లాడి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా, కుళాయిల ద్వారా క్రమం తప్పకుండా నీరు అందుతున్నదా అనే విషయాలను తెలుసుకున్నారు. గ్రామస్థులు తెలిపిన సమస్యలను విని, తాగునీటి సరఫరాను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యురాలు దొండ మౌనిక, గ్రామ పెద్దలు దేవరాజు శంకర్, కదారి ఆదాం, మట్టెడ లింగయ్య, ఏనుగు కోటి రెడ్డి, దేవరాజు మొగిలి, బుసుమల్ల రాజు, నర్రెంగల సమ్మయ్య, దొండ విద్యాసాగర్, గ్రామపంచాయతీ సిబ్బంది కదారి ప్రేమానందం, చిట్యాల వెంకటమ్మ, గబ్బెట వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు,

## మందకృష్ణ జన్మదిన సంబరాలు





**పర్వతగిరి/ జూలై 7 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, సామాజిక ఉద్యమ నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, మండల అధ్యక్షుడు మాసాని గోపాల్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలోనూ ఎమ్మార్పీఎస్ గద్దెల వద్ద నీలి జెండాలను ఆవిష్కరించి, మందకృష్ణ మాదిగ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా అణగారిన వర్గాల హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటాలు చేస్తోందని, మందకృష్ణ మాదిగ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ సంబరాల్లో భాగంగా కార్యకర్తలకు, స్థానిక ప్రజలకు మిఠాయిలు ,స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# యూరియా కొరత లేదన్న కలెక్టర్

## ఆందోళన చెందొద్దు.. జిల్లాలో సమృద్ధిగా నిల్వలు -యాప్‌తో పారదర్శక పంపిణీ: దివాకర్ టీఎస్

**మధిర/జూలై 7 (జర్నలిస్ట్ వార్త):**
జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ స్పష్టం చేశారు. వానాకాలం సాగుకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులు తగిన నిల్వల్లో ఉన్నాయని, ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను పటిష్ఠంగా నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా బుకింగ్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిస్థాయి పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. మంగళవారం మధిర నియోజకవర్గంలోని దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఎరువుల గోడౌన్, విక్రయ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో ఉన్న యూరియా, డీఏపీ, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చారు.



ఇప్పటివరకు వచ్చిన ఎరువుల పరిమాణం, రైతులకు పంపిణీ చేసిన బస్తాలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు, రానున్న సరఫరాపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టామని తెలిపారు. మండలాల వారీగా యూరియా నిల్వల వివరాలు కూడా యాప్‌లో అందుబాటులో ఉండటంతో రైతులు సులభంగా సమాచారం తెలుసుకోవచ్చన్నారు. నానో యూరియా వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని, తొలుత కొంత విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా వినియోగించి ఫలితాలను పరిశీలించాలని సూచించారు. పంట అవసరానికి అనుగుణంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలతోనే ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించాలని రైతులకు సూచించారు.
తనిఖీల్లో ఆర్డీవో శ్రీనివాస్, మధిర తహసీల్దార్ రాంబాబు, వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 17 గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేత

## ఆవిర్భావ వేడుకలు, మందకృష్ణ జన్మదినం ఘనంగా

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 7 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని 17 గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి ఉద్యమ స్ఫూర్తిని చాటారు. మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద జరిగిన ప్రధాన కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ 32 ఏళ్లుగా మాదిగల హక్కుల సాధన, ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం కోసం రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత శస్త్రచికిత్సలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల సంక్షేమం, రేషన్ బియ్యం పెంపు, ఆరోగ్యశ్రీ విస్తరణ, తెలంగాణ ఉద్యమ అమరుల



కుటుంబాలకు న్యాయం తదితర ప్రజా సమస్యలపై మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమాలు సాగాయని గుర్తు చేశారు. మందకృష్ణ మాదిగ ఉద్యమ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించడం ఉద్యమానికి దక్కిన గౌరవమని అన్నారు. ఆయన నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి సామాజిక న్యాయం సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.
మండలంలోని 17 గ్రామాల్లో కార్యకర్తలు జెండా ఆవిష్కరణలు నిర్వహించి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పొడిశెట్టి ప్రతాప్ మాదిగ, మండల అధ్యక్షుడు సోంపల్లి అన్వేష్ మాదిగ, మండల ఉపాధ్యక్షుడు సింగారపు పవన్ మాదిగ, కాంగ్రెస్ నాయకుడు బొడ్డు సురేష్, విహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల బాబు మాదిగ, పాస్టర్ చింత రమేష్ బాబు, జర్నలిస్టులు కొట్టే లెనిన్, నక్క సుమన్, కొట్టే భానుచందర్‌తో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లావ్యాప్తంగా మిన్నంటిన
# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సంబరాలు!

-ఘనంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు - ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ.. పలుచోట్ల నీలి జెండాల ఆవిష్కరణ
-అణగారిన వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం -ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ బిర్రు మహేందర్ మాదిగ పిలుపు





**భువనగిరి/ఆలేరు/యాదగిరిగుట్ట, జూలై 7 (జర్నలిస్ట్ వార్త):**
యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా కేంద్రమైన భువనగిరితో పాటు ఆలేరు నియోజకవర్గ కేంద్రం, యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామాల్లో దళిత, బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్,దండోరా జెండాల పండుగను నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించి, కేకులు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ అన్ని కార్యక్రమాలకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జ్ బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయా వేదికలపై బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా అణగారిన, నిరుపేద వర్గాల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటాలు చేస్తోందని స్పష్టం చేశారు. సామాజిక సేవా రంగంలో, దళిత సమాజ మేల్కొలుపులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. బహుజనుల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆయన నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఎన్నో చారిత్రాత్మక విజయాలు సాధించిందని గుర్తుచేశారు. మందకృష్ణ మాదిగ ఆశయాల సాధనకు, సామాజిక ఉద్యమ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ అదే పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు పండ్ల పంపిణీ చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.
భువనగిరి ఏరియా ఆసుపత్రిలో పండ్ల పంపిణీ..
భువనగిరి టౌన్ అధ్యక్షుడు అందె సాయి మాదిగ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బిర్రు మహేందర్ మాదిగ స్వయంగా బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు పండ్లను అందజేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ సెంటర్ వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 32వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. మహేందర్ మాదిగ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఆలేరు, కాచారంలో జెండా పండుగ..
ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ జెండాను ఎగురవేశారు. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో భాగంగా గ్రామంలో దండోరా నీలి జెండాను మహేందర్ మాదిగ ఘనంగా ఆవిష్కరించారు.
ఈ అన్ని కార్యక్రమాల్లో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, రాష్ట్ర నాయకులు ఇటుకల



దేవేందర్ మాదిగ, గుండె వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కందుల శంకర్ మాదిగ, ఆలేరు మండల అధ్యక్షుడు కందుల నరసింహారావు మాదిగ, టౌన్ నాయకులు రవి మాదిగ, మైనారిటీ ముస్లిం నాయకుడు ఎండి కరీం, స్థానిక దళిత ప్రజాసంఘాల ప్రతినిధులు, గ్రామ కమిటీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన

## జగన్నాథపురంలో వేదికను పరిశీలించిన మంత్రి తుమ్మల



**చింతకాని/జూలై 7 (జర్నలిస్ట్ వార్త):**
ఈ నెల 10న చింతకాని మండలం జగన్నాథపురంమత్కేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, వేదిక, పార్కింగ్, తాగునీరు, రాకపోకలు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న రైతు ఆశీర్వాద సభకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
పరిశీలనలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం



**భీమదేవరపల్లి/జూలై 7 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని వంగర గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో వంగర ఎస్ఐ దివ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బావిలో ఉన్న మృతదేహాన్ని వెలికితీయించి పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మృతురాలు సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామానికి చెందిన మహిళగా గుర్తించారు. ఆమె కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళ ప్రమాదవశాత్తూ బావిలో పడిందా, లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. పోస్టుమార్టం నివేదిక అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# నల్లబెల్లిలో ముందస్తుగా పారిశుద్ధ్య చర్యలు

## వర్షాలు ముసిరేలోపే కాలువల పూడికతీత..

## ప్రారంభించిన సర్పంచ్ అనిత



**వర్ధన్నపేట/జూలై 7(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులను గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ప్రారంభించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని ప్రధాన మురికి కాలువలతో పాటు అంతర్గత కాలువల పూడికతీత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీట మునిగిన పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షపు నీరు సజావుగా సాగిపోయేలా ప్రధాన కాలువలను శుభ్రం చేయిస్తున్నామని, పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేకల దేవేందర్, వార్డు సభ్యులు గోలి సుధాకర్, మహమ్మద్ జమీలాభి, మాజీ ఉపసర్పంచ్ బిర్రు చంద్రయ్య, యువ నాయకులు పొన్నం వేణు, మహిళలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# 7 నుండి 8 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ

## 7 రోజుల్లోనే రైతుభరోసా కింద 7750.45 కోట్లు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జూలై7 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద 7 వ విడతలో 7 నుండి 8 ఎకరాలకు వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ. 259.73 కోట్లను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 58,831 మంది రైతులు, 4.32 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించిన రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు. ంత్రి తుమ్మల మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విడతల వారీగా రైతుభరోసా నిధులను విడుదల చేస్తున్నామని, ఇప్పటికే 6 దశలలో 7 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, ఈ రోజు 7 నుండి 8 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు. ప్పటివరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 68.96 లక్షల మంది రైతులకు, 129.17 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించి రూ.7750.45 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.